సాక్షి చిత్తూరు

శుక్రవారం । 31 । జనవరి । 2025

7



'పీఎం విశ్వకర్మ' సద్వినియోగం చేసుకోండి

పీఎం విశ్వకర్మ పథకాన్ని వినియోగించుకొని ఆర్థికం గా అభివృద్ధి చెందాలని ఎంఎస్ఎంఈ అడిషనల్ డైరెక్టర్ మూర్తి పేర్కొన్నారు. - 8లో



అడవిచేనులో చిరుత కలకలం

గుడిపాల మండలంలో చిరుత కలకలంపై అడవిచేను గ్రామంలోని అటవీ ప్రాంతం లో ఫారెస్ట్ అధికారులు పరిశీలించారు. - 8లో



టీడీపీ నేత బరితెగింపు

కూటమి నేత ప్రభుత్వ భూమిని దర్జాగా ఆక్రమించి ఆ స్థలంలో గోకులం షెడ్డును నిర్మిం చడంపై స్థానికుల ఆగ్రహం - 8లో

న్యూస్‌రీల్

రాజకీయ కక్షతోనే పెద్దిరెడ్డిపై కుట్ర

- కూటమి అన్యాయాలపై ప్రశ్నిస్తే కేసులా ?
- గంగాధర నెల్లూరు ఇన్‌చార్జి కృపాలక్ష్మి ధ్వజం



కృపాలక్ష్మి, జీడీ నెల్లూరు ఇన్‌చార్జి

కార్వేటి నగరం : కూటమి ప్రభుత్వం చేస్తున్న అన్యాయాలు, అక్రమాలు ప్రశ్నిస్తే కేసులా అని గంగాధర నెల్లూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కృపాలక్ష్మి మండి పడ్డారు. గురువారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై కూటమి ప్రభుత్వం రాజకీయ కక్షతోనే కుట్ర లకు పాల్పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేద ప్రజల కోసం నిరంతరం పోరాడే వైఎస్ జగనన్న చుట్టూ ఉన్న బలమైన నాయ కులనే టార్గెట్ చేసి అన్ని రకాలుగా దెబ్బతీయ డంతో పార్టీని నిర్వీర్యం చేయాలనే కుతంత్రం తోనే కూటమి నేతలు వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. వైఎస్సార్‌పార్టీ పేద ప్రజల కోసం నిరంతర పోరాటాలకు సిద్ధమని, ఇలాంటి బెదిరింపులకు భయపడేది లేదని స్పష్టం చేశారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డి పై వారం రోజులుగా చేస్తున్న అసత్య ప్రచారాలను , పచ్చ మీడియా చేస్తున్న దుర్మార్గపు రాతలను ఆమె ఖండించారు.

ఏషియన్ షూటింగ్ పోటీలకు జిల్లా క్రీడాకారులు



పరశురాముడు

గుడుపల్లె : అంతర్జాతీయ షూటింగ్ బాల్ పోటీలకు ఉమ్మడి చిత్తూరు జిల్లా క్రీడాకారు లు మొహమ్మద్ యూ సఫ్, పరశురాముడు ఎంపికై నట్లు చిత్తూరు జిల్లా షూటింగ్ అసోషియేషన్ కార్యదర్శి వేణుగోపాల్ గురువారం తెలిపారు. ఫిబ్రవరి 1వ తేదీ నుంచి 3వ తేదీ వరకు నేపాల్ దేశంలో మూడు రోజులు జరగనున్న రెండో ఏషియన్ షూ టింగ్ బాల్ పోటీలకు భారత క్రీడాకారుడుగా మొహమ్మద్ యూసఫ్, టెక్నికల్ అఫి సియ ల్‌గా పరశురాముడు ఎంపికైనట్లు షూ టింగ్ బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి జీత్‌రాజ్ తోమర్ నుంచి ఉత్తర్వు వచ్చిందన్నారు. మొహమ్మద్ యూసఫ్ ఉమ్మ డి చిత్తూరు జిల్లా మదనపల్లె, పరశురా ముడు కర్నూలు జిల్లాకు చెందిన వారన్నారు. చిత్తూరు జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ చైర్మన్ మహేష్, అధ్యక్షుడు పవన్‌కల్యాణ్, సభ్యులు సెల్వమ్ లోకనాథ్ స్వాతీ జబ్బర్ సురేష్‌లు వారిని అభినందించారు.

కాణిపాకంలో ప్రిన్సిపల్ సెక్రటరీ



స్వామి చిత్రపటంతో ప్రిన్సిపల్ సెక్రటరీ

కాణిపాకం : కాణిపాకంలోని శ్రీ వర సిద్ధి వినాయకస్వామిని గురువారం రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సూర్యకుమారి దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికారు. దగ్గరుండి దర్శన సేవలు అయ్యేలా చూశారు. తర్వాత వేద ఆశీర్వచన మండపంలో పండితులు ఆశీర్వచనాలు, స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

అమ్మో.. ఆర్‌ఎంపీలొస్తున్నారు

- అమాయక ప్రజల ప్రాణాలతో చెలగాటం
- తమిళనాడు, కర్ణాటక నుంచి తరలివస్తున్న వైనం
- అర్హతకు దూరం.. ఐడీ, తప్పుడు పత్రాలతో వైద్యం
- జిల్లాలో పుట్టగొడుగుల్లా ఆర్‌ఎంపీలు
- పట్టించుకోని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు

- గంగాధర నెల్లూరు మండల కేంద్రంలోని ఓ ఆర్‌ఎంపీ చేతిలో ఓ వృద్ధుడు బలి అయ్యాడు. అనారోగ్యంతో వెళ్లిన ఆ వృద్ధుడికి స్థాయికి మించి వైద్యం చేయడంతో ప్రాణాలు కోల్పోయాడు. ఈ విషయం తెలిసిన అప్పటి డీఎంహెచ్ఓ ఆర్‌ఎంపీ క్లినిక్‌ను తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వైద్యం చేస్తున్నాడని గుర్తించారు. కానీ ఎలాంటి చర్యలు తీసుకోకుండా వదిలేశారు.
- పెనుమూరు క్రాస్‌లో ఇటీవల ఓ ఆర్‌ఎంపీ క్లినిక్‌ను తనిఖీ చేశారు. అక్కడికి పురిటి బిడ్డలను తీసుకొస్తున్నా వైద్యం చేస్తుండడంపై ఆశ్చర్యపోయారు. స్థాయికి మించి సెలైన్ బాటిళ్లు పెట్టడం, అన్ని రకాల మందులు విక్రయిస్తున్నాడని గుర్తించారు. దీనికి తోడు పశువుల మందులు ఇస్తుండడం చూసి విస్తుపోయారు. ఆ ఆర్‌ఎంపీని టచ్ చేసేందుకు అధికారులు వెనుకడుగు వేశారు.





కుప్పంలోని ఓ ఆర్‌ఎంపీ వైద్యులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న వైనం

కాణిపాకం : ఆర్‌ఎంపీలకు జిల్లా అడ్డాగా మారింది. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి ఆర్‌ఎంపీలు జిల్లాలోకి చొరబడుతున్నారు. సరిహద్దుల్లో కాసుకూర్చున్నారు. ప్రథమ చికిత్స అంటూ పనికానిచ్చేస్తున్నారు. అర్హతతో పని లేకుండా ఐడీ కార్డులు, తప్పుడు పత్రాలతో స్థాయికి మించి వైద్యం చేస్తున్నారు. దీంతో జిల్లాలో అమాయక ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. దీనిపై జిల్లా వైద్య ఆరోగ్య అధికారులు పట్టించుకోవడం లేదని తీవ్ర విమర్శలు ఉన్నాయి.

ఐడీలతో ఆర్‌ఎంపీల అవతారం

జిల్లాలో ఆర్‌ఎంపీల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ప్రస్తుతం జిల్లాలో సుమారు 3 వేల మంది ఆర్‌ఎంపీలు ఉన్నారు. కొంత మంది యూనియన్ నాయకులు ఇచ్చే ఐడీ కార్డులు, పత్రాలను తీసుకుని ఆర్‌ఎంపీలుగా చెలామణి అవుతున్నారు. ఇందుకు రూ. 10 వేల నుంచి రూ.లక్ష వరకు సమర్పించుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. ఈ సర్టిఫికెట్ ఉంటే ఈజీగా డబ్బులు సంపాదించవచ్చునని ఆర్‌ఎంపీలుగా అవతారమెత్తుతున్నారు. ఎలాంటి అర్హత, పరిజ్ఞానం లేకుండా అమాయకుల నాడీ పట్టి ప్రాణాలు తీస్తున్నారు.

అక్కడి నుంచి ఇక్కడికి మకాం మార్చి..

తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలు ఆర్‌ఎంపీలు, పీఎంపీలు ప్రాక్టీస్‌ను అక్కడి ప్రభుత్వం నిలుపుదల చేసింది. అక్కడ కొన్ని నిబంధనలు కచ్చితంగా అమలు చేసింది. ఒక వేళ గుట్టు చప్పుడు కాకుండా క్లినిక్‌లు నిర్వహిస్తే దాడులు చేసి కేసులు బనాయిస్తోంది. దీంతో అక్కడున్న ఆర్‌ఎంపీలు, పీఎంపీలు తలదాచుకునే ప్రయత్నంలో పడ్డారు. మెల్లగా హద్దులు దాటి జిల్లాను అడ్డాగా మార్చుకున్నారు. ప్రాథమిక చికిత్స అందించాల్సిన వీరు ఏకంగా ప్రత్యేక భవనాల్లో పడకలు ఏర్పాటు చేసి పదుల సంఖ్యలో రోగులకు వైద్యం అందిస్తున్నారు. గత పదేళ్ల కాలంలో 1300 మంది జిల్లాకు చేరుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. గ్రామాల్లో ప్రజలు ఏ రోగమొచ్చినా ముందుగా గుర్తొచ్చేది ఆర్‌ఎంపీలే. వెంటనే వారి వద్దకు వెళ్లడం చికిత్స తీసుకోవడం, మరునాడే పనులకు వెళ్లడం పరిపాటి. నిపుణులైన వైద్యుల వద్దకు వెళితే ఇంత త్వరగా రోగం తగ్గదు. అందుకే ఆర్‌ఎంపీలకు అంత గిరాకీ. సదరు ఆర్‌ఎంపీలు వారి వద్దకు వచ్చే రోగులకు ఒక చేతికి పెయిన్ కిల్లర్, మరో చేతికి స్టెరాయిడ్ మందును ఇంజెక్షన్ రూపంలో ఇస్తారు. దీంతో ఫలానా డాక్టర్ రెండు సూదులు వేయగానే రోగం తగ్గిపోయిందని గొప్పగా చెప్పుకుని దీర్ఘకాలంలో వచ్చే వ్యాధులను పట్టించుకోవడం మానేస్తున్నారు. ధనార్జనే ధ్యేయంగా ప్రజల ప్రాణాలను హరిస్తున్నారు.

ఆర్‌ఎంపీలే అధికం

తమిళనాడు, కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లో ఆర్‌ఎంపీలు అధికమయ్యారని అధికారుల గణంకాలు చెబుతున్నాయి. ప్రధానంగా కుప్పంలో ఆర్‌ఎంపీలు కుప్పలు తెప్పలుగా ఉన్నారని అధికారులు గుర్తించారు. చిత్తూరు, గుడిపాల, శాంతిపురం, పలమనేరు, పుంగనూరు, యాదమరి, బంగారుపాళ్యం, జీడీనెల్లూరు, పాలసముద్రం, గంగవరం, వీ.కోట, కార్వేటినగరం, శ్రీరంగరాజుపురం, నగరి తదితర మండలాల్లో ఆర్‌ఎంపీ అడ్డాలు చేసుకొని అడ్డగోలుగా వైద్యం చేస్తున్నారని మండల వైద్యాధికారులు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు నివేదికలు పంపారు.

తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలలో ఆర్‌ఎంపీలపై కఠిన నిబంధనలతో పాటు నిషేధం ఉంది. దీంతో జిల్లా సరిహద్దుకు ఆనుకొని ఉన్న పొరుగు రాష్ట్రాల నుంచి ఆర్‌ఎంపీలు ఇక్కడికి వలస వస్తున్నారు. ధనార్జనే ధ్యేయంగా ఇక్కడికి వచ్చి స్థాయికి మించి వైద్యం చేస్తూ ప్రజల ప్రాణాలను పొట్టనపెట్టుకుంటున్నారు. జిల్లాలో ఎక్కడో ఒకచోట వీరి వైద్యానికి వృద్ధులు, శిశువులు, గర్భిణులు, పిల్లలు బలి అవుతూనే ఉన్నారు. వీరిని కట్టడి చేసేందుకు జిల్లా వైద్యాధికారులు పటిష్ఠ చర్యలు, తనిఖీలు లేకపోవడంతో చెలరేగిపోతున్నారు. వీరికి అండగా ఉండేలా కొంత మంది యూనియన్ నాయకులు వీరికి వత్తాసు పలుకుతూ రాజకీయాలు చేస్తూ జిల్లా అధికారులనే భయభ్రాంతులకు గురిచేస్తున్నారు.

ఆర్‌ఎంపీపై డీఎంహెచ్‌ఓ విచారణ



ఆర్‌ఎంపీని విచారిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ

బైరెడ్డిపల్లె : చిన్నారి వైష్ణవి మృతికి కారుకులైన ఆర్‌ఎంపీని గురువారం సాయంత్రం బైరెడ్డిపల్లె పీహెచ్‌సీలో డీఎంఅండ్‌హెచ్‌ఓ సుధారాణి విచారణ చేపట్టారు. ఆర్‌ఎంపీలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని, ప్రథమ చికిత్స మాత్రమే రోగులకు అందించాలని హెచ్చరించారు. పూర్తి విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సిండికేట్ వ్యాపారం

జిల్లాలో ఆర్‌ఎంపీ సిండికేట్ వ్యాపారంలా మారింది. కొందరు అధికారాన్ని అడ్డం పెట్టుకుని రెచ్చిపోతున్నారు. స్వార్థం కోసం ఇష్టానుసారంగా పదో తరగతి చదవని వ్యక్తులు కూడా సర్టిఫికెట్లు ఇస్తూ ఆర్‌ఎంపీలను తెరపైకి తీసుకొస్తున్నారు. వీరు ప్రథమ చికిత్స వదిలి మిగిలిన అన్ని వైద్య సేవలు చేస్తున్నారు. ఈ విషయం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు తెలిసిన ఏమాత్రం పట్టించుకోవడంలేదు. తనిఖీలు చేసి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నా తేలికగా వదిలేస్తున్నారు. చూసీ చూడనట్లు మిన్నకుండిపోతున్నారు. దీంతో జిల్లాలో ఆర్‌ఎంపీల వైద్యం మూడు మాత్రలు, ఆరు సిరంజిలుగా విరాజిల్లుతోంది. ఇక తనిఖీలకు వెళ్లిన కొంత మంది సిబ్బంది వారితో చేతులు కలుపుతున్నారు. నెలనెలా మామూళ్లు తీసుకుని పట్టించుకోకుండా వదిలేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఆర్‌ఎంపీలపై ప్రత్యేక నిఘా



ఆర్‌ఎంపీలు స్థాయికి మించి వైద్యం చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ప్రథమ చికిత్స చేసే వ్యక్తులు ప్రభుత్వ ఆదేశాలను తప్పనిసరిగా పాటించా లి. ఆర్‌ఎంపీలు స్వయంగా రోగ నిర్ధారణ చేసి మందులు ఇవ్వడం లేదా ఇంజెక్షన్‌లు చేయడం నేరం. రోగులకు మందుల చీటీ (ప్రిస్క్రిప్షన్‌లున్) రాయకూడదు. అబార్షన్‌లు, కాన్పులు వంటి హైరిస్క్ చికిత్సలు చేయకూడదు. రోగులను ప్రలోభపెట్టి వైద్యం కోసం ఆసుపత్రులకు సిఫార్సు చేయడం, బలవంతంగా పంపించడం చేయకూడదు. జిల్లాలో ఆర్‌ఎంపీలపై ప్రత్యేక నిఘాను పెడుతున్నాం. నిబంధనలను ఉల్లంఘిస్తే కఠినంగా వ్యవహరిస్తాం.

– సుమిత్‌కుమార్ గాంధీ, కలెక్టర్, చిత్తూరు.

రోడ్డు భద్రత పాటించాలి



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్



ర్యాలీలో వాహనదారులు

- కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : వాహనాలు నడిపే సమయంలో తమ కుటుంబ సభ్యులను దృష్టిలో ఉంచుకుని రోడ్డు భద్రత నియమాలను పాటించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా గురువారం చిత్తూరు నగరంలో ఆర్టీఓ కార్యాలయం నుంచి భారీ బైక్ ర్యాలీని కలెక్టర్, డీటీసీ నిరంజన్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జనవరి 15 నుంచి ఫిబ్రవరి 16 వరకు నెల రోజుల పాటు నిర్వహిస్తున్న సడక్ సురక్షా అభియాన్ కింద రోడ్డు భద్రతలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. మూడేళ్ల కాలంలో సంభవించిన రోడ్డు ప్రమాదాల్లో ద్విచక్ర వాహనదారులు అధిక సంఖ్యలో మరణించినట్లు గణాంకాలు తెలుపుతున్నాయన్నారు. రోడ్డు భద్రతా చర్యల్లో భాగంగా జాతీయ రహదారులపై బ్లాక్ స్పాట్‌లను గుర్తించి జాగ్రత చర్యలు చేపడుతున్నామని, గుంతలను పూడ్చడం, పెండింగ్ రోడ్డు పనులను పూర్తి చేస్తున్నామన్నారు. ప్రజలు కచ్చితంగా హెల్మెట్ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్టీఓ సునీల్‌కుమార్, ఏంవీఐలు రాజేశ్వరరావు, నరసింహులు, శివకుమార్, మురళీ, ట్రాఫిక్ సీఐ నిత్యబాబు పాల్గొన్నారు.

జంతువులతో ఫ్రెండ్లీగా ఉండాలి

గుడిపాల : జంతువులను ఎవరూ హింసించోద్దని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి ప్రభాకర్ అన్నారు. గురువారం నరహరిపేట జడ్పీ హైస్కూల్‌లో జంతు సంక్షేమ పక్షోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు జంతువుల పట్ల ఎలా ఉండాలి అన్న అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జంతువులతో ఫ్రెండ్లీగా ఉండాలన్నారు. జంతువుల యొక్క చట్టాలు, జంతువులపై కలిగిన శాసనాలను విద్యార్థులకు టీవీ రూపంలో చూపించి వివరించారు. అనంతరం విద్యార్థులకు ఎస్సే పోటీలు , జంతువులపై స్పీచ్‌ను నిర్వహించారు. ఇందులో ఆరుగురు విద్యార్థులకు సర్టిఫికెట్లతో పాటు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్లు సాయిసుధ, రవితేజ, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు సర్టిఫికెట్, బహుమతులు అందజేస్తున్న ప్రభాకర్

బాబు మాటలు బూటకం

- ప్రజలను మోసం చేయడంలో దిట్ట
- ప్రతి ఎన్నికల్లోనూ మోసపూరిత హామీలు
- 8 నెలలు అవుతున్నా ఒక్క హామీ అమలు చేయని ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నేతలు

కుప్పం : ముఖ్యమంత్రి చంద్రబాబు మాటలన్నీ బూటకమని వైఎస్సార్‌సీపీ నేతలు ఆరోపించారు. గురువారం ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ప్రతి ఎన్నికల్లోనూ చంద్రబాబు ప్రజలను మోసం చేయడంలో దిట్టని ఎద్దేవా చేశారు. ఎన్నికల ముందు రాష్ట్రం మరో శ్రీలంక అవుతుందని, రూ.14 లక్షల కోట్ల అప్పులు ఉన్నాయని, రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని తప్పుడు ప్రచారం చేశారని విమర్శించారు. అనంతరం అధికారం చేపట్టాక రాష్ట్ర బడ్జెట్ రూ.6 లక్షల కోట్లు రాష్ట్రంలో అప్పుల్లో ఉన్నట్లు తేల్చినట్లు వారు తెలిపారు. చంద్రబాబు ఆయనకు వంత పాడే పచ్చమీడియా మాజీ సీఎం జగన్‌పై బురద చల్లేందుకు రూ.14 లక్షల కోట్లు అప్పులు ఉన్నట్లు తప్పుడు ప్రచారం చేశారన్నారు. సూపర్ సిక్స్ హామీలు ఎందుకు అమలు చేయలేదని విమర్శించారు. ఎన్నికల ముందు మెగా డీఎస్సీపైన మొదటి సంతకం అని చెప్పి పట్టించుకోకపోవడం ఏమిటన్నారు. ప్రశ్నించేందుకే వచ్చానని చెప్పిన పవన్ కల్యాణ్ ఇప్పుడు ఎందుకు ప్రశ్నించలేదన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్నప్పుడు కరోనా కష్ట కాలంలో సైతం హామీలన్నీ అమలు చేసిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతుందని అన్నారు. గత ప్రభుత్వ హయంలో జరిగిన అభివృద్ధిని నిలిపివేశారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర వన్నెకుల క్షత్రియ విభాగ అధ్యక్షుడు శ్రీను, మురుగేష్, జిల్లా వైఎస్సార్ సీపీ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి భాస్కర్ నాయక్, రామకుప్పం మండల కన్వీనర్ బాబు రెడ్డి, రామకుప్పం ఎంపీపీ సుబ్రమణ్యం, కో కన్వీనర్ చంద్రరెడ్డి పాల్గొన్నారు.

హరిత దీప్తి.. కాణిపాకం కీర్తి

పాఠశాల ఆవరణలో ఏపుగా పెరిగిన చెట్లు



ఆ పాఠశాలలోకి వెళుతుంటే..అదేదో మనస్సుకు ఉత్తేజం..ఉల్లాసం కలిగించేలా ఆహ్లాదకరమైన వాతావరణం కనిపిస్తుంది.. చూస్తుంటే ఏదో మనస్సును ప్రశాంతత వైపు తీసుకెళ్లే ఉద్యానవనాన్ని తలపిస్తుంది. ఎక్కడ చూసినా పరుచుకున్న పచ్చదనం.. తరగతి గదుల వద్ద ఆకర్షించే పూలకుండీలు.. స్వచ్ఛమైన తాగునీరు, వృథా నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలు పెంపొందించడం, ఉపాధ్యాయుల అంకిత భావం, విద్యార్థుల తపన, స్థానికులు, దాతల సహకారంతో పాఠశాల ఆవరణ ప్రకృతి రమణీయత ఉట్టిపడేలా తీర్చిదిద్దారు. సమష్టిగా కృషి చేస్తే ఫలితం ఎలా ఉంటుందో కాణిపాకం ఉన్నత పాఠశాలే ఇందుకు నిదర్శనం.. దీనికి ఏటా జాతీయ స్థాయిలో హరిత పాఠశాల పురస్కారం రావడం అందరూ గర్వించదగ్గ విషయం.

- హరిత స్కూల్‌గా కాణిపాకం
- జాతీయ స్థాయిలో మూడోసారి ఎంపిక
- 4న ఢిల్లీలో పురస్కారం స్వీకరణ
- సమష్టి కృషితో విజయం
- హర్షం వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు , స్థానికులు

ఐరాల : మండలంలోని కాణిపాకం ఉన్నత పాఠశాలకు మరోసారి హరిత పురస్కారం చేజిక్కుంచుకుంది. జాతీయ స్థాయిలో హరిత పాఠశాలగా మూడోసారి ఎంపికైంది. సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ (సీఎస్ఈ)వారిచే ఏటా ఆడిట్ నిర్వహిస్తారు. పాఠశాలను హరిత పాఠశాలగా తీర్చిదిద్దడంలో ఎన్‌సీసీ కోఆర్డినేటర్, జీవ శాస్త్ర ఉపాధ్యాయుడు సురేంద్రబాబు కీలక భూమిక పోషించారు. హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానికుల సహకారంతో పాఠశాలను హరిత పాఠశాలగా మార్చడానికి మొక్కలు నాటి సంరక్షించడం, ఆవరణను హరితమయం చేయడంలో విజయం సాధించారు. విద్యుత్‌ను పొదుపుగా వాడడం, 5 స్టార్ పరికరాలు, ప్రత్యామ్నాయ మార్గాలను అనుసరించడంలో లక్ష్యాలను అధిగమించారు. నీటిని పొదుపుగా వాడడం, వృథా నీరు, వర్షపు నీటిని ఒడిసి పట్టి ఇంకుడు గుంతలు, వాటర్ హార్వెస్టింగ్ ద్వారా భూగర్భ నీటి నిల్వలు పెంపొందించడంలో చొరవ చూపారు. దీంతో 2018–19లో కాణిపాకం ఉన్నత పాఠశాలను తొలిసారి జాతీయ స్థాయి పురస్కారం వరించింది. మళ్లీ 2019–20లో రెండోసారి, ప్రస్తుతం 2024–25లో మూడోసారి అవార్డుకు పాఠశాల ఎంపిక కావడం విశేషం.

దాతల సాయం

ఇన్ఫోసిస్ ఫౌండేషన్ వారు పాఠశాలకు రూ.1.40 కోట్ల సాయం అందించడంతో పాఠశాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. విద్యార్థులకు విశాలమైన తరగతి గదులు, వెలుతురు, గాలి వచ్చేలా తరగతి గదులను నిర్మించారు. గదులకు ఇరువైపులా పూల మొక్కలు, నీడ ఇచ్చే చెట్ల పెంపకంతో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించారు.

స్వచ్ఛమైన నీరు

విద్యార్థులకు స్వచ్ఛమైన ఆర్‌ఓ నీరు అందిస్తున్నారు. నీటిని వృథా చేయకుండా పరిమితంగా వాడడం, వృథా నీటిని చెట్లకు మళ్లించడం, వర్షపు నీటిని ఒడిసి పట్టి ఇంకుడు గుంతల ద్వారా భూగర్భ జలాన్ని పెంచడానికి కృషి చేశారు. మురుగు నీరు నిల్వ లేకుండా చేయడంలో శ్రద్ధ చూపారు. విద్యార్థులకు పోషకాలతో కూడిన సంప్రదాయ ఆహారాన్ని అందించడంలో ప్రత్యేక చొరవ చూపారు. నిల్వ చేసిన ప్యాకింగ్ చేసిన ఆహారాన్ని విద్యార్థులు స్వీకరించకుండా వారిలో అవగాహన పెంపొందించి హరిత పాఠశాలగా రూపొందించడంలో విజయం సాధించారు.

పచ్చదనం పెంపుపై ప్రత్యేక శ్రద్ధ

పాఠశాల ఆవరణలో చెట్లను పెంచడం, సంరక్షించడం, తరగతి గదుల వద్ద పూల మొక్కలు పెంచడంపై ప్రత్యేక దృష్టి సారించారు. స్వచ్ఛమైన గాలిని ఇచ్చే మొక్కలు పెంచి పోషించడం తద్వారా ఆరోగ్యకరమైన, స్వచ్ఛమైన గాలి, ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా ప్రత్యేక చొరవ చూపారు. దీన్ని పర్యవేక్షించడానికి నేషనల్ గ్రీన్ క్యాప్స్ (ఎన్‌జీసీ) బృందాన్ని భాగస్వామ్యులు చేశారు.



పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న ఎన్‌జీసీ బృందం

సమష్టి కృషితో అవార్డు



మా పాఠశాల ఎన్‌సీసీ కోఆర్డినేటర్, సైన్స్ ఉపాధ్యాయుడు, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థుల సమష్టి కృషితో మూడోసారి జాతీయస్థాయి అవార్డు దక్కడం సంతోషంగా ఉంది. గాలి, నీరు, నేల, శక్తి, ఆహారం, వ్యర్థాల నిర్వహణ అంశాల్లో విద్యార్థులను జట్లుగా ఏర్పాటు చేసి పాఠశాలలో పర్యావరణ జాగృతి కార్యక్రమాలను నిర్వహించడంతో విద్యార్థుల్లో సానుకూల దృక్పథం ఏర్పడి తత్ఫలితంగా హరిత పాఠశాల అవార్డు పొందడం గర్వకారణం.

– చంద్రశేఖర్‌నాయుడు, హెచ్ఎం, కాణిపాకం, ఐరాల

పంచాయతీకి గర్వకారణం



పాఠశాలలో పరిశుభ్రత, పచ్చదనం పెంచడంలో ఉపాధ్యాయుల, పంచాయతీ సిబ్బంది కృషి మరువలేనిది. పాఠశాల పేరు దేశ స్థాయిలో హరిత పాఠశాలగా గొప్ప స్థాయికి తీసుకురావడం సంతోషకరం. కాణిపాకం పంచాయతీలో ఉన్న పాఠశాలకు మూడోసారి జాతీయ స్థాయి అవార్డు రావడం పాఠశాలకు, పంచాయతీకి, పరిసర గ్రామాల ప్రజలకు గర్వకారణం. –శాంతిసాగర్‌రెడ్డి, సర్పంచ్, కాణిపాకం, ఐరాల

క్లుప్తంగా

వీఆర్ఏల పదోన్నతుల్లో న్యాయం చేయండి



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న వీఆర్ఏల సంఘం నేతలు

రొంపిచెర్ల : వీఆర్ఏలకు ప్రభుత్వం ఇస్తున్న పదోన్నతుల్లో అటెండరు, వాచ్‌మన్, వీఆర్‌ఓలుగా ఇవ్వాలని తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌కు ఉమ్మడి చిత్తూరు జిల్లా వీఆర్ఏల సంఘం నాయకులు తిరుపతి కలెక్టరేట్‌లో లక్ష్మణ్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా వెట్టి చాకిరి చేస్తున్నామని తెలిపారు. ప్రమోషన్లలో ప్రతి ఒక్కరికీ న్యాయం చేయాలని కోరారు. నేతలు దేవరాజ్, సాంబయ్య, బాల సుబ్రమణ్యం, ఇర్ఫాన్‌అలీ, నాగరాజు, అంకయ్య, హరి, శిరీష పాల్గొన్నారు.

పీఎం విశ్వకర్మ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో అర్హులందరూ పీఎం విశ్వకర్మ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంఎస్ఎంఈ అడిషనల్ డైరెక్టర్ మూర్తి అన్నారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్‌లోని డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో అవగాహన సదస్సు నిర్వహించారు. పీఎం విశ్వకర్మ పథకం కింద అర్హులైన వారికి అవసరమైన పనిముట్ల కిట్లను సైతం అందిస్తారన్నారు. ఎంపికయ్యే ప్రతి లబ్ధిదారుడికి లక్ష రూపాయల రుణం ఇవ్వడం జరుగుతుందన్నారు. తీసుకున్న రుణం సక్రమంగా చెల్లిస్తే రెండో విడతలో రూ.2 లక్షలు ఇస్తారని చెప్పారు. జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ హరీష్ మాట్లాడుతూ .. అర్హులందరికీ పీఎం విశ్వకర్మ పథకంను మంజూరు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మెప్మా పీడీ రవీందర్, డీఐసీ వెంకటరెడ్డి, డీపీఎంలు రవి, సరిత, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గుణశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

పాఠశాలల విలీనం ఆపాలి : ఎస్టీయూ

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రభుత్వ పాఠశాలల విలీన ప్రక్రియను ఆపాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు మదన్‌మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న జీఓ 117 సవరణ ప్రక్రియ సంఘాలతో చర్చించిన అంశాలకు భిన్నంగా చేస్తున్నారని ఆరోపించారు. వెంటనే మోడల్ పాఠశాలల ఏర్పాటు పేరుతో ప్రస్తుతం చేస్తున్న సమీప పాఠశాలల విలీన ప్రక్రియను నిలిపి వేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు చదివే ప్రాథమికోన్నత పాఠశాలలను కొనసాగించాలన్నారు. మోడల్ పాఠశాలలు 60 మంది విద్యార్థులు ఎక్కడ ఉంటే అక్కడ ఏర్పాటు చేస్తామని తొలుత ఉపాధ్యాయ సంఘాలకు చెప్పారన్నారు. కానీ ప్రస్తుతం 40 మంది నుంచి 45 మంది విద్యార్థులకు సమీప ప్రాంతాల్లో ఉన్న ప్రాథమిక పాఠశాలలను మోడల్ ప్రాథమిక పాఠశాలలో విలీనం చేసేలా కసరత్తు చేస్తున్నారన్నారు. విలీన ప్రక్రియ ఆపకపోతే ఆందోళనలు చేపడుతామని ఆయన హెచ్చరించారు.

నిరుద్యోగులపై సైబర్ వల

- ఖాతాలో నగదు వేస్తే.. ఉద్యోగం పేరిట బురిడీ
- అధికారుల పేరుతో దరఖాస్తుదారులకు కాల్స్
- సమగ్ర విచారణ చేస్తున్న అధికారులు
- కాల్స్ చేసిన సైబర్ నేరగాడిపై కేసు నమోదు

చిత్తూరు కలెక్టరేట్ : ఖాతాలో నగదు వేస్తే.... ఉద్యోగం గ్యారెంటీ అంటూ అపరిచిత వ్యక్తుల నుంచి దరఖాస్తుదారులకు కాల్స్ వస్తున్నాయి. తాజాగా ఓ ఘటన చిత్తూరు జిల్లాలో చోటుచేసుకుంది. ఇటీవల వైద్య ఆరోగ్య శాఖలో స్టాఫ్‌నర్స్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేశారు. ఆ మేరకు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి నిరుద్యోగ అభ్యర్థులు స్టాఫ్‌నర్స్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్నారు. ఇలా చేసుకున్న అభ్యర్థుల పూర్తి వివరాలు, ఫోన్ నంబర్‌లతో సహా వెబ్‌సైట్‌లో ఉండడంతో సైబర్ నేరగాళ్లు మోసం చేసేందుకు వెసులుబాటు కలిగింది. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల జాబితాలో ఉన్న నంబర్‌లకు కాల్స్ చేయడం మొదలు పెట్టారు.

దరఖాస్తుదారులతో డీల్

జిల్లాలోని రొంపిచెర్లకు చెందిన ఓ దరఖాస్తుదారుడికి బాలాజీ పేరుతో కాల్ చేశారు. చెప్పినంత డబ్బులు రెడీ చేసి ఖాతాలో వేస్తే స్టాఫ్‌నర్స్ ఉద్యోగం కచ్చితంగా వస్తుందని నమ్మించారు. ఆ దరఖాస్తుదారుడు ఈ విషయాన్ని కుటుంబ సభ్యులతో చర్చించారు. సైబర్ నేరగాడు వాట్సాప్‌లో మెసేజ్ చేయడం మొదలు పెట్టారు. ఆలస్యం చేయకుండా డబ్బులు రెడీ అయ్యాక కాల్ చేయండి అని సంక్షిప్త సందేశాలు పంపించారు. అనుమానం వచ్చి జరిగిన విషయంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ విచారణకు ఆదేశించారు. కాల్స్ చేసిన వ్యక్తి ఎవరు.... ఏమిటి అని విచారణ చేశారు. కాల్స్ చేసిన నంబర్ డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయం వారిది ఎవ్వరిదీ కాదని తెలుసుకున్నారు. ఆ తర్వాత కాల్స్ వచ్చిన నంబర్ ఆధారంగా పోలీసులకు కలెక్టర్ ఫిర్యాదు చేశారు. సంబంధిత సైబర్ నేరగాడిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.




దరఖాస్తుదారునికి స్కామర్ చేసిన కాల్‌హిస్టరీ

ఉద్యోగాలు ఇప్పిస్తామంటే నమ్మవద్దు

నగదు ఇస్తే ఉద్యోగాలు ఇప్పిస్తామనే అపరిచితులను దరఖాస్తుదారులు ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మకూడదు. ఇలాంటి సైబర్ నేరగాళ్ల కాల్స్ చేస్తే తొందర పాటుతో ఎలాంటి నగదు వారికి వేయకూడదు. ఏ శాఖలోనైనా ఉద్యోగాల భర్తీ ప్రక్రియ నిబంధనల మేరకే నిర్వహిస్తాం. నోటిఫికేషన్ నిబంధనల మేరకు ఉద్యోగాలు భర్తీ చేయడం జరుగుతుంది. ఫిర్యాదు అందిన సైబర్ నేరగాడి వివరాల ఆధారంగా ఎఫ్ఐఆర్ నమోదు చేశాం. సమగ్ర విచారణ నిర్వహిస్తున్నాం.



– సుమిత్ కుమార్ గాంధీ, కలెక్టర్, చిత్తూరు.



వాట్సాప్‌లో దరఖాస్తుదారునికి స్కామర్ పంపిన మెసేజ్‌లు

చోరీ కేసులో నిందితుల అరెస్టు

- రూ.19.42 లక్షల విలువైన నగదు, నగలు స్వాధీనం



సీజ్ చేసిన ఆభరణాలు, నగదుతో వివరాలు వెల్లడిస్తున్న చిత్తూరు డీఎస్పీ సాయినాథ్

చిత్తూరు అర్బన్ : చిత్తూరు నగరంలో ఈనెల 18వ తేదీ వెలుగు చూసిన చోరీ కేసులో షేక్ మొయిద్దీన్ (32), ఎం.మణికంఠ (43) అనే ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. గురువారం చిత్తూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ సాయినాథ్, సీఐ జయరామయ్య, ఎస్ఐ శ్రీనివాసులుతో కలిసి వివరాలను మీడియాకు వివరించారు. ట్రాన్స్‌కోలో పనిచేసి పదవీ విరమణ పొందిన సెల్వరాజ్ ఈనెల 17న ఆరోగ్యం బాలేక వేలూరులో ఆసుపత్రికి వెళ్లి మరుసటి రోజు ఇంటికి వచ్చాడు. తాళం వేసిన ఇంటిని పగులగొట్టిన గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లో భారీగా నగదు, నగలు చోరీ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. తమిళనాడులోని వేలూరులోని ఓ కళాశాల వద్ద ఉన్న మొయిద్దీన్, మణికంఠలను అరెస్టు చేశారు. నిందితుల నుంచి 238 గ్రాముల బంగారు ఆభరణాలు, 64 గ్రాముల వెండి ఆభరణాలు, రూ.4.06 నగదు, ఓ వాచీ, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.19,42,000 ఉంటుందని పోలీసులు తెలిపారు. అలాగే నిందితుల వద్ద ఉన్న ఓ ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. దర్యాప్తులో వీళ్ల పలుచోట్ల చోరీలకు పాల్పడ్డట్లు తెలిసిందని, దీనిపై విచారణ చేయాల్సి ఉందన్నారు.

పేదల సమస్యలపై ఫోకస్

- పారిశుద్ధ్యం, తాగునీటి పరిష్కారానికి కృషి
- పీహెచ్‌సీల పర్యవేక్షణకు ప్రత్యేక ప్రాజెక్ట్
- త్వరలో జిల్లాకు రెండు కొత్త నేషనల్ హైవే ప్లాన్‌లు
- విలేకరులతో కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో పేద ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని, పేదలు అందజేస్తున్న వినతులకు కాస్త ఆలస్యమైనా వంద శాతం పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నామని కలెక్టరేట్‌లో గురువారం కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ విలేకరులతో పలు అంశాలను వెల్లడించారు. జిల్లాలోని ఎస్ఆర్‌పురం మండలం పాతపాళెం దళితులకు న్యాయం చేసేలా చర్యలు చేపడుతున్నామన్నారు. గతంలో ఆ దళితులకు ఇచ్చిన భూమికి ఎటువంటి సమస్య ఉండదని ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వారికి న్యాయం చేయాలని ఎస్ఆర్‌పురం తహసీల్దార్‌ను ఆదేశించామన్నారు.

పారిశుద్ధ్యం, తాగునీటిపై ప్రత్యేక శ్రద్ధ

జిల్లాలోని నగరాలు, గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీటి సమస్యల పై ప్రత్యేక ఫోకస్ పెట్టడం జరిగిందన్నారు. ఎంపీడీఓలు నిత్యం గ్రామాల్లో ప ర్యటించాలని ఆదేశి ంచినట్లు కలెక్టర్ తెలిపారు. రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేయాలని ఆయా శాఖలను ఆదేశించామన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

మొక్కుబడిగా అర్జీలు పరిష్కరించకుండా...

ప్రజలు అందజేసే అర్జీలను ఏదో మొక్కుబడిగా పరిష్కరించడం కాకుండా వారి సమస్యలు వంద శాతం పరిష్కరించేలా చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ప్రజలు తనను నేరుగా కలిసి తమ సమస్యలు చెప్పుకునేలా అవకాశం కల్పిస్తున్నామని కలెక్టర్ చెప్పారు.

పీహెచ్‌సీల పర్యవేక్షణకు ..

జిల్లాలోని పీహెచ్‌సీ (ప్రైమరీ హెల్త్ సెంటర్)ల పర్యవేక్షణకు మార్చి తర్వాత కొత్త ప్రాజెక్టును అమలు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. కుప్పంలో పైలట్ విధానంలో అమలు చేస్తామని తర్వాత జిల్లా మొత్తం అమలు చేస్తామని చెప్పారు.

జిల్లాకు రెండు కొత్త నేషనల్ హైవేలు.

జిల్లాకు త్వరలో రెండు కొత్త నేషనల్ హైవేలు మంజూరు కానున్నాయని కలెక్టర్ చెప్పారు. ఆ హైవేలకు సంబంధించి త్వరలో వివరాలు విడుదల చేస్తామన్నారు. సీఎంసీ ఆసుపత్రి వద్ద ఫ్లైవోవర్ పూర్తికాబోతోందన్నారు. చీలాపల్లి సీఎంసీ పనులు వేగవంతంగా సాగుతున్నాయన్నారు. అంగన్‌వాడీ పిల్లల ఎదుగుదలకు సంబంధించి కుప్పంలో కొత్తగా ప్రాజెక్టును అమలు చేస్తున్నామన్నారు.

జిల్లా కేంద్రంలో కొత్త పరిశ్రమ

జిల్లా కేంద్రమైన చిత్తూరులో కొత్తగా ఒక పరిశ్రమ రానుందని, ఇందుకు సంబంధించి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ పేర్కొన్నారు. అదే విధంగా చిత్తూరు, కుప్పంలలో కేంద్రీయ విద్యాలయాలు ఏర్పాటు చేయాలని కేంద్రానికి నివేదికలు పంపించామని తెలిపారు. జిల్లాలో డామినో పిజా ప్లాంట్, మరో రెండు పరిశ్రమల స్థాపనకు భూ కేటాయింపులు చేస్తున్నామన్నారు. నగరి నియోజకవర్గంలో ఆర్ అండ్‌బీ రోడ్ల నిర్మాణానికి రూ.35 కోట్లు ఖర్చు చేస్తున్నామని ఇతర ప్రాంతాల్లో రోడ్ల పనులు త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ వివరించారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 3 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 62,710 మంది స్వామివారిని దర్శించుకోగా 15,635 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.14 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

అడవిచేనులో చిరుత కలకలం

- భయాందోళనలో గ్రామస్తులు

గుడిపాల : చిరుత దాడిలో నాలుగు మేకలు మృతి చెందాయి. గుడిపాల మండలంలోని అడవిచేను గ్రామానికి చెందిన రామకృష్ణ మేకలు మేపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం ఇంటికి మేకలు తీసుకొచ్చే సమయంలో అయిదు మేకలు రాలేదు. తిరిగి వెళ్లి చూడగా కొంత దూరంలో ఓ బండపై మేకలు ఉండడంతో వాటిని తీసుకొచ్చేందుకు వీలు కాకపోవడంతో అక్కడే వదిలి వచ్చేశాడు. గురువారం తిరిగి మేకలను తీసుకొస్తామని వెళ్లిచూడగా నాలుగు మేకలు మృతి చెంది ఉన్నాయి. అన్ని మేకలకు గొంతువద్దే గాయాలు ఉండడంతో చిరుత చంపేసిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వెంటనే సంఘటనా స్థలానికి అటవీశాఖ డివిజినల్ రేంజ్ ఆఫీసర్ ఆనందరెడ్డి, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ డిల్లిరాణి, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ అరుణ, జబీరుల్లాలు చేరుకున్నారు. సంఘటన జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. చిరుతపులి దాడి చేసిందా? లేక రేసు కుక్కలు ఏవైనా దాడి చేసి చంపేశాయా అని చుట్టు పక్కల ప్రాంతాల వారిని విచారిస్తున్నారు.



మృతిచెందిన మేక

అటవీ ప్రాంతంలోకి వెళ్లొద్దు

అటవీ ప్రాంతంలోకి ఎవరూ వెళ్లకూడదని డీఆర్‌ఓ ఆనందరెడ్డి తెలిపారు. అటవీ ప్రాంతంలోకి వెళ్తున్న కాపరులు, కొంతమంది గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. తమిళనాడు ప్రాంతం నుంచి ఓ చిరుత మన అటవీ ప్రాంతానికి వచ్చిందని చెబుతున్నారే గానీ ఎక్కడ కనిపించలేదన్నారు. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచనలు చేశారు. అనంతరం టపాకాయలను తీసుకెళ్లి అటవీప్రాంతంలో పేల్చారు.

టీడీపీ నేత బరితెగింపు

- ప్రభుత్వ స్థలం ఆక్రమణ
- భూమిని స్వాధీనం చేసుకున్న అధికారులు

శ్రీరంగరాజపురం : మండలంలోని మంగుంట గ్రామంలో భూకబ్జాదారులు రెచ్చిపోతున్నారు. గురువారం మంగుంట గ్రామస్తులు విలేకరులతో మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన టీడీపీ నేత జీవన్‌బాబురెడ్డి మంగుంట రెవెన్యూలో 19/1,19/2లో సుమారు 0.9 సెంట్ల భూమిని ఆక్రమించారన్నారు. ఈ భూమిని గతంలో గ్రామస్థులందురూ కలిసి గ్రామ అవసరాలకు 0.9 సెంట్లను కేటాయించినట్లు తెలిపారు. రెవెన్యూ రికార్డులోని ఈ భూమిని సబ్ డివిజన్ చేసి పాలశీతల కేంద్రానికి గతంలో ఇచ్చారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం రావడంతో జీవన్‌బాబురెడ్డి ఈ భూమిలో గోకులంషెడ్డును నిర్మించారని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంపై గ్రామస్థులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో బుధవారం రెవెన్యూ సిబ్బంది తనిఖీ చేసి ఈ భూమి ప్రభుత్వానిదని తేల్చేశారు. ఆక్రమణకు గురైన భూమిని రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఏవరైనా ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. కూటమి నేతలు చేసే దౌర్జన్యాలను ప్రశ్నిస్తే మాకు ప్రభుత్వం నుంచి అందే పథకాలను రద్దు చేస్తామని బెదిరిస్తున్నారని గ్రామస్తులు వాపోయారు.



విలేకరులతో మాట్లాడుతున్న మంగుంట గ్రామస్థులు

నాటు తుపాకీ నాటకాలు !

- వైఎస్సార్‌సీపీకి ఓటేశాడని కేసు
- టీడీపీ వారి నాటు తుపాకుల జోలికెళ్లని పోలీసులు

సాక్షి, టాస్క్‌ఫోర్స్ : గత ఎన్నికల్లో టీడీపీ నేతలు ఓటుకు వెళ్లినప్పుడు ఓ వ్యక్తిని సైకిల్‌కు ఓటేయాలని అక్కడి టీడీపీ నేతలు అడగ్గా తాను వేయనని వైఎస్సార్‌సీపీకే వేస్తానని ఆ వ్యక్తి సమాధానం ఇచ్చాడు. ఎందుకంటే తనకు జగనన్న ప్రభుత్వంలో ఉండేందుకు పక్కా ఇల్లు వచ్చిందని అందుకే ఓటేస్తానని కూడా వారికి వివరించాడు. దీన్ని మనసులో పెట్టుకున్న ఆ టీడీపీ నేతలు సమయం కోసం వేచి ఉంటూ ఇప్పుడు నాటు తుపాకీ కేసులో ఇరికించేసినట్లు బాధితుడి కుటుంబికులు ఆరోపిస్తున్నారు. వారు తెలిపిన వివరాల మేరకు...పలమనేరు మండలంలోని జరావారిపల్లి పంచాయతీ దొడ్డిపల్లి గ్రామం అడవికి సమీపంలో ఉంది. ఈ గ్రామంలో కొందరు వేట కోసం నాటు తుపాకులను రహస్యంగా ఉంచుకున్నట్లు సమాచారం. ఇలా ఉండగా ఇదే గ్రామానికి చెందిన మొగిలప్ప కుమారుడు నాగప్ప(35), నాగరాజ కుమారుడు శివ(35) స్నేహితులు. కాగా వీరిలో శివ టీడీపీ కార్యకర్త కాగా నాగప్ప వైఎస్సార్‌సీపీ అభిమానిగా ఉంటున్నారు. గతంలో నుంచి వీరిద్దరి వద్ద నాటు తుపాకులున్నాయి. ఈ నేపథ్యంలో ఇటీవల వీరిమధ్య భేదాభిప్రాయాలు వచ్చినట్లు తెలిసింది. దీంతో నాగప్పవద్ద నాటు తుపాకీ ఉన్న విషయాన్ని శివ అక్కడి కూటమి నేతలకు చెప్పాడు. దీంతో వారు ఎలాగైనా ఈ కేసులో నాగప్పను ఇరికించాలని పోలీసుల సాయంతో కథ నడిపించినట్లు తెలిసింది. దీంతో రెండ్రోజుల కిందట గ్రామంలోకి వచ్చిన పోలీసులు నాగప్పను పట్టుకొని అతని వద్దనున్న నాటు తుపాకీని సీజ్ చేసి స్టేషన్‌కు పట్టుకొచ్చారు. దీంతో ఆగ్రహించిన నాగప్ప కుటుంబికులు, బంధువులు వేటగాళ్ల నాటు తుపాకులున్న అందరి వేటగాళ్లపై కేసులు పెట్టి సీజ్ చేయాలని, అలాగా కాకుండా కేవలం ఒకరిని పట్టుకోవడం ఏంటని దీనిపై తాము ఎస్పీని కలిసి జరిగిన విషయంపై ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

కళ్లలో కారం కొట్టి .. దారి దోపిడీకి యత్నం

- మాధవరం సమీపంలో ఘటన
- అడవిలోకి పారిపోయిన గుర్తుతెలియని వ్యక్తి
- ద్విచక్ర వాహనదారుడికి తీవ్రగాయాలు

తవణంపల్లె : మండలంలోని మాధవరం సమీపంలోని కనంగట్టు వద్ద గుర్తుతెలియని వ్యక్తి మాస్క్ ధరించి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వస్తున్న అక్క, తమ్ముడిపై కారంపొడి చల్లి దోపిడీకి యత్నించాడు. కళ్లలో కారం పొడి పడడంతో అక్క, తమ్ముడు ద్విచక్ర వాహనాన్ని నడపలేక కిందపడిపోయి గట్టిగా కేకలు వేశారు. ఈ క్రమంలో తమ్ముడికి కాలు విరిగిగా అక్కకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు వివరాలిలా.. మాధవరం పంచాయితీ ఎం.బోయపల్లెకు చెందిన వినయ్‌రెడ్డి(22), అక్క అరుణ ద్విచక్ర వాహనంలో బుధవారం రాయల్‌పేట రోడ్డులో మాధవరానికి సుమారు కిలోమీటరు దూరంలో కనంగట్టు వద్ద ఉన్న బండ వద్దకు వినయ్‌రెడ్డి, అక్క అరుణ ద్విచక్రవాహనంలో వస్తుండగా అడ విలో నుంచి గుర్తు తెలియని యువకుడు జర్కిన్ వేసుకొని, నల్లమాస్క్ ధరించి నల్ల టవల్ వేసుకొని వచ్చి కళ్లలోకి కారంపొడి చల్లాడు. అప్పటికే వెనుక వైపు ఎం.బోయపల్లెకు చెందిన రాజారెడ్డి ద్విచక్రవాహనంపై రావడంతో గమనించిన అగంతకుడు అడవిలోకి పారిపోయాడు. స్కూటర్‌పై నుంచి పడిన వినయ్‌రెడ్డికి కాలు విరిగింది. అరుణ స్వల్ప గాయాలు కాగా అగంతకుడి చేతి నుంచి ప్రాణాలతో బయటపడ్డారు. గాయపడిన వారిని స్థానికులు అరగొండ అపోలో హాస్పిటల్‌కు చికిత్స నిమిత్తం చేర్పించారు. దీనిపై తవణంపల్లె ఎస్ఐ చిరంజీవి మాట్లా డుతూ.. నిఘా పెంచి సీసీ కెమెరాల్లోని ఫుటేజీల ద్వారా దొంగలను గుర్తించి పట్టుకోవడానికి ప్రత్యేక టీంలను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. దారి దోపిడీ చేశారా? లేక కక్షలతో దాడి చేశారా? అనే కోణాల్లో పోలీసులు విచారణ చేస్తున్నారు. గురువారం సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి పశువుల కాపరులు , స్థానికులను ఘటనపై విచారించారు.



దారి దోపిడీ ఘటనలో గాయపడి చికిత్స పొందుతున్న వినయ్‌రెడ్డి

గ్రాంట్ ఇన్ ఎయిడ్‌కు దరఖాస్తు చేసుకోండి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో గిరిజన సంక్షేమం కోసం కృషి చేస్తున్న ఎన్‌జీఓలు గ్రాంట్ ఇన్ ఎయిడ్ పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి మూర్తి తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో గిరిజన సంక్షేమం కోసం కృషి చేస్తున్న ఎన్‌జీఓలు, వాలంటీర్ ఆర్గనైజేషన్స్ గ్రాంట్ ఇన్ ఎయిడ్‌కు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న, కొత్త ప్రాజెక్టుల అభ్యర్థులు www.ngo.triba.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. 2024–25 సంవత్సరానికి దరఖాస్తు చేసుకునేందుకు ఫిబ్రవరి 15 వ తేదీ వరకు అవకాశం కల్పించారన్నారు. దరఖాస్తు చేసుకున్న అనంతరం మూడు సెట్ల ప్రతిపాదనలను కలెక్టరేట్‌లోని గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో అందజేయాలన్నారు. ఇతర వివరాలకు 08572–241056 సంప్రదించాలన్నారు.

కలెక్టర్‌ను కలిసిన సీఎండీ

చిత్తూరు కలెక్టరేట్ : ట్రాన్స్‌కో సీఎండీ సంతోష్‌రావు గురువారం కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీని కలిశారు. జిల్లాలో పీఎం కుసుం పథకం అమలు విధానంపై సీఎండీ కలెక్టర్‌కు పలు వివరాలు వెల్లడించారు. ఈ పథకంలో జిల్లాలో 35 ప్రభుత్వ స్థలాలు ఎంపిక చేసినట్లు తెలిపారు. సోలార్ ప్లాంట్స్ పెట్టి అక్కడ ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను అగ్రికల్చర్ సరీస్సులకు ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈ పథకాన్ని పకడ్బందీగా అమలు చేసేలా ప్రణాళికలు అమలు చేస్తున్నట్లు సీఎండీ కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో ట్రాన్స్ కో ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్, ఈఈ మునిచంద్ర పాల్గొన్నారు.

బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలి

చిత్తూరు కలెక్టరేట్ : విద్యాశాఖ కార్యాలయాల్లో బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వినాయకం కోరారు. ఈ మేరకు గురువారం ఆర్‌జేడీ శామ్యూల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రతి పాఠశాలలో అంబేడ్కర్ విగ్రహం పెట్టాలన్నారు. నెలవారీ టీచర్ల ఉద్యోగోన్నతులు చేపట్టాలన్నారు. వేసవి సెలవుల్లో బదిలీల ప్రక్రియ నిర్వహించాలని చెప్పారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు మురగేష్, భాస్కర్, సురేష్, కుమార్ పాల్గొన్నారు.

రూ.9.02 లక్షల ప్యాకేజీతో ఉద్యోగాలు



పూర్ణిమను అభినందిస్తున్న కళాశాల అధ్యాపకులు



తేజశ్రీని అభినందిస్తున్న పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకులు

- ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థినుల ప్రతిభ

పలమనేరు/కుప్పం రూరల్ : ఏపీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ప్రతిష్ఠాత్మక టెక్సాస్ మల్టీ నేషనల్ ఇన్స్ట్రుమెంట్స్ కంపెనీలో ఉద్యోగాల కోసం నిర్వహించిన రాష్ట్ర స్థాయి పరీక్షలో పలమనేరు, కుప్పం పాలిటెక్నిక్ కళాశాలల్లో డిప్లొమో చదువుతున్న విద్యార్థినులు ఎంపికయ్యారు. టెక్సాస్ మల్టీ నేషనల్ ఇన్స్ట్రుమెంట్స్ కంపెనీలో ఉద్యోగాల కోసం ఆ హెచ్‌ఆర్‌లు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పాలిటెక్నిక్ విద్యార్థులకు ఎంట్రన్స్ పరీక్షను ఇటీవల నిర్వహించారు.

ఇందులో రాష్ట్రంలోని 30 పాలిటెక్నిక్ కళాశాలలకు చెందిన 800 మందికి పైగా విద్యార్థులు పరీక్ష రాశారు. వీరిలో 17 పాలిటెక్నిక్ కళాశాలలకు చెందిన 98 మంది ఇంటర్వ్యూకు ఎంపికయ్యారు. వీరిలో 15 మందికి మాత్రం ఉద్యోగాలు దక్కాయి. వీరిలో పలమనేరు , కుప్పం కళాశాలలకు చెందిన పూర్ణిమ, తేజశ్రీ ఒక్కొక్కరూ రూ.9.02 లక్షల ప్యాకేజీతో ఈ ఉద్యోగాలకు ఎంపికయ్యారు.